క్లుప్తంగా

వేడుకగా శ్రీరామ హోమం



దుగ్గొండి : మండలంలోని బంధంపల్లిలోని దాసాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ ఉపాసకుడు గాదెపాక రాములు ఆధ్వర్యంలో ఆదివారం 536వ శ్రీరామ హోమం వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. పాడి పంటలు బాగుండాలని భగవంతుని వేడుకున్నారు. హోమంలో హనుమాన్ మాలధారులు, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

ఖానాపురం : కోతులు దాడి చేయడంతో వృద్ధురాలికి గాయాలైన ఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు లచ్చమ్మ తన ఇంటి ఎదుట చెట్టు కింద నిద్రిస్తుండగా కోతులు గుంపుగా వచ్చి ఆమెపై దాడి చేశాయి. దీంతో లచ్చమ్మ తప్పించుకునే ప్రయత్నం చేయగా కింద పడిపోయింది. ఆమె చేయి విరిగింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స కోసం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ బస్సుకు కారు ఢీ



ఖానాపురం : ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటన మండలంలోని అశోక్‌నగర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పాకాలకు కారులో వచ్చిన పర్యటకులు గిరకతాటి వనం వైపు నుంచి వస్తుండగా కొత్తగూడ నుంచి నర్సంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. కారు వేగంగా బస్సు దిశగా దూసుకు వస్తుండటాన్ని గమనించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును నిలిపేసే ప్రయత్నం చేస్తుండగానే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో, బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయలయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పరామర్శ



దుగ్గొండి : మండలంలోని చాపలబండకు చెందిన బీఆర్‌ఎస్ మండల నాయకుడు కంచరకుంట్ల శ్రీనివాసరెడ్డి సోదరుడు, ప్రముఖ వ్యాపారి కంచరకుంట్ల రాజిరెడ్డి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత రాజిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, మాజీ మండల అధ్యక్షుడు ఆరె జైపాల్‌రెడ్డి, నాయకులు బానోతు రవీందర్, కురంగడ్ల లింగయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం



గీసుకొండ : మండలంలోని మనుగొండకు చెందిన చాపర్తి యశ్వంత్, పేర్ల లింగయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆదివారం రూ.5 వేల చొప్పున సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, బొందాలు, కూనమల్ల అనిల్, మేకల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

శాయంపేట : మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి, శివమార్కండేయ ఆలయంలో శ్రీ ఏకాదశ వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆదివారం మూడోరోజు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భద్రకాళి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి, శ్రీ పర్వత వర్ధని సమేత శివమార్కండేయ స్వామి, శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పంచముఖ అంజనేయస్వామి, నాగదేవత విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మూలమంత్ర హవనం, హోమాలు నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, పర్వత వర్ధని సమేత శివ మార్కండేయ స్వామి కల్యాణ మహోత్సవాలను వేద మంత్రోచ్చరణాల మధ్య వైభవంగా చేపట్టారు. హైకోర్టు న్యాయవాది మామిడి రూపేందర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్, ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, ఆలయ అర్చకులు మార్త రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : ఎన్నికల సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది



పర్వతగిరి : పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్సై



గీసుకొండ : పోలింగ్ సామగ్రితో సిబ్బంది, పోలీసులు



పోలింగ్‌కు సిద్ధం

సాక్షి నెట్‌వర్క్ : నర్సంపేట, చెన్నారావుపేట, నల్లబెల్లి, నెక్కొండ, దుగ్గొండి, ఖానాపురం, వర్ధన్నపేట, పర్వతగిరి, సంగెం, గీసుకొండ, తదితర మండలాల్లో పోలింగ్‌కు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నేటి (సోమవారం) ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ జరగనుంది. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఈవీఎంలు, ఇతర సామగ్రితో చేరుకున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీటి, టెంట్లు, ఇతర సదుపాయాలు కల్పించారు. వికలాంగుల కోసం ప్రత్యేకంగా వీల్‌చైర్లు, సహాయకులను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరాతోపాటు టాయిలెట్లు, గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు అమర్చారు. అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పర్వతగిరి : పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



నెక్కొండ : పోలింగ్ బూత్‌కు వస్తున్న సిబ్బంది



సంగెం : పోలింగ్ సామగ్రితో సిబ్బంది



నెక్కొండ: విధుల్లో మహిళా ట్రైనీ కానిస్టేబుళ్లు



దుగ్గొండి : పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



ఖానాపురంలో..

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు నష్టం

● పూడుకుపోయిన తూములు

సంగెం : అధికారుల నిర్లక్ష్యంతో మండల కేంద్రంలోని ఊరచెరువు కింద పంటలు సాగు చేస్తున్న రైతులు ఏటా నష్టపోతున్న దుస్థితి నెలకొంది. గత యాసంగిలో చెరువు నిండా నీరు ఉన్నప్పటికీ తూములు పూడుకుపోయిన దుస్థితిలో నీరు బయటకు రాక రబీలో వరి సాగు చేసుకోలేకపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఊర చెరువు మిట్ట తూము కట్టపై 2008లో బుంగపడగా కొంత మేర పూడుకుపోయింది. అప్పటి నుంచి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఏటా కొంత పెరుగుతూ తూము పూర్తిగా పూడుకుపోయింది. దీంతో గత యాసంగిలో చెరువులో నీరున్నా నాట్లు వేయలేక రైతులు భారీగా నష్టపోయారు. ఈసారైనా తూముకు మరమ్మతులు చేపడితేనే రానున్న ఖరీఫ్‌లో వరి నాట్లు వేసుకోగలమని రైతులు ఎదురు చూస్తున్నారు. కాలం నెత్తిమీదకు వచ్చిన ప్రస్తుత తరుణంలో వెంటనే అధికారులు స్పందించి పూడుకుపోయిన తూములకు మరమ్మతు చేయించి ఖరీఫ్‌లో పంటలు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని రైతులు వేడుకుంటున్నారు.



పూడుకుపోయిన సంగెం ఊర చెరువు మిట్ట తూమును చూపిస్తున్న రైతులు

తూముకు మరమ్మతు చేయించాలి



మిట్ట తూము పూర్తిగా పూడుకుపోయింది. తూము నుంచి నీరు బయటకు రావడం లేదు. జూన్‌లో కాలం కాగా వరి నార్లు పోసుకోవాల్సి ఉంది. త్వరగా మరమ్మతు పనులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

-తాటికొండ కిష్టయ్య, మాజీ నీటి సంఘం చైర్మన్

'ఉపాధి'లో కాలువలు తీయించాలి



చెరువు ఆయకట్టు కింద ఉన్న పంట కాలువలను ఉపాధి హామీ పథకం పనుల్లో భాగంగా తీయించాలి. తద్వారా కూలీలకు, రైతులకు లబ్ధి చేకూరుతుంది. రైతులకు పెట్టుబడి కూడా గిట్టుబాటు కావడం లేదు.

-నూర వీరస్వామి, రైతు, సంగెం

ప్రతిపాదనలు పంపిస్తాం

తూము పూడుకుపోయిన విషయం వాస్తవమే. మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం, నిధులు మంజూరు కాగానే తూముకు మరమ్మతు పనులు చేయిస్తాం. తద్వారా త్వరలో తూము మరమ్మతులు చేయించి రైతుల సమస్యలు పరిష్కరిస్తాం.

-హమీద్, ఐబీ ఏఈ, సంగెం

నూరు శాతం ఓటింగ్ జరగాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సుదర్శన్‌గౌడ్

నర్సంపేట : పార్లమెంటు ఎన్నికల్లో నూరు శాతం ఓటింగ్ జరగాలని స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌజ్ వద్ద ఆదివారం నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులందరూ నిజాయితీగా ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ప్రలోభాలకు లోను కావద్దని చెప్పారు. స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ ఓటు వేయడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల వలంటీర్ పంజాల రాజు, ఆటోడ్రైవర్లు, ప్రచాణికులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



వర్ధన్నపేట : కండువా కప్పుతున్న నాయకులు



ఖానాపురం:పార్టీలో చేరిన వారితో నాయకులు

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాలలో వార్డు సభ్యుడు దుప్పెల్లి రాజుతోపాటు సుమారు 50 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా వారికి ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య, గుజ్జ రవీందర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బండారి సతీశ్ గౌడ్, కట్ట వెంకటయ్య, తీగల సునీత, తాటికాయల కుమారస్వామి, ఎలికట్టె రాజు, బుర్ర సురేందర్, గండు మల్లేశం, బైరి రాజు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెడిపాక ఉపేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముస్తఫా, నాయకులు వీరమనేని సాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా జగదాచార్య జయంతి



జగదాచార్య జయంతి ఉత్సవాల్లో భక్తులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జగదాచార్య శ్రీరామానుజా తిరునక్షత్ర సందర్భంగా జగదాచార్య 1007వ జయంతిని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి కోఆర్డినేటర్ దాస్యం రంగనాథస్వామి మాట్లాడారు. చెన్నయ్‌లోని శ్రీరంగంలో ఆలయ గోపురం 237 అడుగులు ఉండగా తెలంగాణలోని హైదరాబాద్ ముచ్చింతల్ శ్రీరామనగర్‌లో శ్రీరామానుజుల విగ్రహం 216 అడుగులోతు ఉందని చెప్పారు. భూలోక వైకుంఠముగా భక్తులకు దర్శనమిస్తున్నారని తెలిపారు. తొలుత అర్చకులు ముడుంబై రామాచార్య విశ్వక్సేన, పుజాధికాల అనంతరం భక్తుల చేత భాగవత్ రామానుజ అష్టోత్తర శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము, పారాయణం వేడుకగా చేయించారు. అనంతరం వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ శ్రీరామనగర్‌లోని ఆలయాన్ని ప్రజలందరూ దర్శించుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, వికాస తరంగిణి కార్యకర్తలు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో సమన్వయం కీలకం

సంగెం : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయం కీలకమని సీఐ శ్రీధర్‌రావు, ఎస్సై నరేశ్ స్పష్టం చేశారు. బందోబస్తు విధులు నిర్వహించేందుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న సిబ్బందికి ఆదివారం వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌రావు, ఎస్సై నరేశ్ మాట్లాడారు. ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత నిర్వహించాలని చెప్పారు. ఎన్నికల నిబంధనలు తప్పకుండా పాటించాలని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. 114 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో గుంపుగా, నలుగురికి మించి తిరగడం నిషేధమని స్పష్టం చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే సీ-విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని లేదా డయల్ 100కు సమాచారం అందించాలని చెప్పారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



గీసుకొండ : మండలంలోని రాంపురం గ్రామానికి చెందిన పులి శంకర్, రవి, అనిలళ రాజు, బిక్షపతి, పసుల రాజు, చిలుపూరి రవి, తదితర కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ నాయకుడు నాంపెల్లి సారంగపాణి ఆధ్వర్యంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. పార్టీ బలోపేతం కోసం పాటుపడాలని సూచించారు. ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా శ్రేణులు పాలక పార్టీల తప్పుడు విధానాలపై పోరాటాలు నిర్మించాలని చెప్పారు.

సమాజంలో తల్లి పాత్ర కీలకం



రాధాబాయిని సన్మానిస్తున్న హేమలత, సభ్యులు

నెక్కొండ : సమాజంలో తల్లి పాత్ర కీలకమని ట్రూ గాస్పెల్ హీలింగ్ మినిస్ట్రీస్ సొసైటీ ప్రెసిడెంట్ దొడ్డ హేమలత తెలిపారు. మండల కేంద్రం ఆ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మదర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ ట్రెజరర్ మాలోతు రాధాబాయిని ప్రెసిడెంట్ దొడ్డ హేమలత, సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం సొసైటీ ప్రెసిడెంట్ హేమలత మాట్లాడారు. ప్రపంచంలో తల్లి పాత్ర కీలకమని చెప్పారు. దైవానికి ప్రతిరూపంగా అమ్మను భావించడం సంప్రదాయమని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు దేశబోయిన వరలక్ష్మి, జాటోతు దివ్య, జనరల్ సెక్రటరీ మాలోతు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీటీడీఓను వెంటనే సస్పెండ్ చేయాలి

నర్సంపేట : గిరిజన సంక్షేమ శాఖను మూడేళ్లుగా భ్రష్టు పట్టిస్తున్నాడంటూ హనుమకొండ, జనగామ డీటీడీఓ ప్రేమకళను వెంటనే సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్ ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో పని చేస్తున్న వార్డెన్లు, వర్కర్స్, కాంటిజెన్స్ ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టడంతోపాటు చిన్నపాటి తప్పులను సాకుగా చూపించి సస్పెండ్ చేసి తిరిగి లక్షలాది రూపాయలు దండుకుని ఉద్యోగంలో తీసుకుంటున్నారని తెలిపారు. ఒక్కో వార్డెన్‌కు రెండేసి స్థానాలు చొప్పున అప్పగిస్తూ డైట్ బిల్లుల నుంచి 20 శాతం చొప్పున డబ్బు వసూలు చేస్తూ అక్రమంగా కోట్లకు పడగలెత్తుతున్నాడని చెప్పారు. డీటీడీఓ ప్రేమకళ సంపాదించిన ఆస్తులపై ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారి సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని, కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. డీటీడీఓను సస్పెండ్ చేయకపోతే ఆందోళనలు చేపడతామని తెలిపారు.

రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరన్నకు సన్మానం

ఖిలా వరంగల్: భద్రకాళి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వరంగల్‌లోని భద్రకాళి భద్రేశ్వరుడి కల్యాణ మహోత్సవానికి తెలంగాణ రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరన్న ఆదివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పెరక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు దిడ్డి నరేందర్, జిల్లా అధ్యక్షుడు వడ్డె రవీందర్, అచ్చ వినోద్ కుమార్ ఘనంగా సన్మానించారు. తొలుత చైర్మన్ ముత్తినేని వీరన్న భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో రాధాకృష్ణ, మల్లేశ్వర్, సుంచు కట్టమల్లు, చింతం యాదగిరి, లక్ష్మీనారాయణ, వీరన్న, శంకరయ్య, శ్రీను, రాజేష్, అల్లం రాజేష్ పాల్గొన్నారు.

హమాలీలకు టవల్స్ పంపిణీ



హమాలీలకు టవల్స్ అందజేస్తున్న రాజు

దుగ్గొండి : ఎండల తీవ్రత నేపథ్యంలో మండలంలోని నాచినపల్లి గ్రామంలోని హమాలీ కార్మికులకు మాజీ సర్పంచ్ పెండ్యాల మమత భర్త రాజు ఆదివారం ఉచితంగా టవల్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎండలు దంచి కొడుతున్న ప్రస్తుత తరుణంలో వరిధాన్యం, మొక్కజొన్న పంటలు చేతికొచ్చాయని చెప్పారు. ఈ క్రమంలో రైతన్నలు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని తెలిపారు. వేసవి ఎండల నుంచి రక్షించుకునేలా హమాలీలకు ఉచిత చేనేత టవల్స్ అందజేసినట్లు వివరించారు. కార్మికులు మధ్యాహ్న వేళల్లో విరామం తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హమాలీలు స్వామి, రాజు, ఖాజీయాదవ్, రమేశ్, శ్రీను, రవి, అయిలయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా గుండు చెరువు విస్తరణ

ఖిలా వరంగల్: చారిత్రక మధ్యకోటలో సువిశాలమైన గుండు చెరువు విస్తరణ, పూడికతీత పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. కుడా అధికారుల ఆధ్వర్యంలో ఏకశిల పార్కు నిర్వాహకుడి పర్యవేక్షణలో చెరువు విస్తరణ పనులు జరుగుతున్నాయి. గత 20 ఏళ్ల క్రితం చెరువు కట్టను అభివృద్ధి చేసి ఏకశిల చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేశారు. పార్కు నిర్వహణతో నెలకు రూ.లక్షల్లో ఆదాయం సమకూర్చి పెట్టిన అభివృద్ధి విషయంలో కుడా అధికారులకు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. చారిత్రక కోటకు దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులకు మరింత ఉల్లాసం, ఆహ్లాదం అందించేలా దీర్ఘకాలిక అభివృద్ధి పనులు చేపట్టాలని, చెరువు చుట్టూ సముద్రపు బీచును తలపించేలా సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు చరిత్రకారులు విన్నవించారు. దాంతో కుడా అధికారులు స్పందించి నిధులు కేటాయించారు. కొన్ని రోజులుగా చెరువు విస్తరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. చెరువులో పూడికతీత చేపట్టి గోదావరి జలాలతో నింపాలని, వర్షపు నీరు చెరువులోకి వచ్చేలా కాల్వల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.